మీ గళం.. మా కలం...!

# నమస్తే హైదరాబాద్

www.namasthehyderabad.in

తెలుగు దిన పత్రిక

విలేకరులు కావలెను

నిత్యనూతనంగా వెలువడుతూ విశేష ప్రజాధరణ పొందుతున్న నమస్తే హైదరాబాద్ తెలుగు దినపత్రికకు తెలంగాణ రాష్ట్రం లోని అన్ని జిల్లా, మండల కేంద్రాలలో విలేకరులు కావలెను

సీనియర్‌లకు ప్రాధాన్యం
కొత్తవారికి అవకాశం

Ph: 9912580066

రంగా రెడ్డి సంపుటి : 13 సంచిక :145 ఎడిటర్: గొడిశాల సోమయ్య మంగళవారం 22-10-2024 పేజీలు :4 వెల : 2రూ

## తెలంగాణలో కరెంట్ చార్జీల పెంపు



నమస్తే హైదరాబాద్ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి తెలంగాణలో 1200కోట్ల మేర విద్యుత్ చార్జీల పెంపునకు ప్రభుత్వ అనుమతి కోరుతూ డిస్కంలు ప్రతిపాదనలు పంపాయి. హైటెన్షన్ కేటగిరీ విద్యుత్ చార్జీల పెంపు.. లోటెన్షన్ చార్జీల పెంపు పేరుతో డిస్కంలు ప్రతిపాదించాయి. హెచ్‌టీ కేటగిరీకి చార్జీల పెంపుతో 700కోట్లు.. ఫిక్స్‌డ్ చార్జీల పెంపుతో 100కోట్లు కలిపి 800కోట్ల భారం పడనుంది. మరో 400కోట్లను ఎల్టీ వినియోగదారుల నుంచి ఫిక్స్‌డ్ చార్జీల పెంపుతో రాబట్టుకుంటామని డిస్కంలు ప్రతిపాదనలో పేర్కొన్నాయి. కరెంట్ చార్జీల పెంపు ప్రతిపాదనలపై బీఆర్ఎస్ అభ్యంతరం వ్యక్తం చేసింది. ప్రజలపై కోట్ల రూపాయల భారం మోపాలని ప్రభుత్వం చూస్తోందని ఆరోపించారు ఆ పార్టీ నేతలు. కరెంట్ చార్జీల పెంపు ప్రతిపాదనను తిరస్కరించాలని కోరుతూ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్‌ను కోరారు. అలాగే తమ వాదనల్ని వినిపించారు. ఒకేసారి ప్రజలపై ఇంత భారం మోపడం దారుణమన్నారు కేటీఆర్. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో వ్యవసాయ రంగం నుంచి పారిశ్రామిక రంగం వరకు అన్నీ సంక్షోభంలో కూరుకుపోయాయని ఆరోపించారు. పారిశ్రామిక రంగానికి చెందిన అన్ని కేటగిరీలకు ఒకే రేటు నిర్ణయించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఫిక్స్‌డ్ ఛార్జీల పేరుతో గృహ వినియోగదారులపై భారం మోపే ప్రయత్నం సరికాదన్నారు కేటీఆర్. ప్రజలపై విద్యుత్ చార్జీల భారం మోపేలా రాష్ట్ర విద్యుత్ సంస్థలు దాఖలు చేసిన 9 వేర్వేరు పిటిషన్లపై ఈఆర్సీ బహిరంగ విచారణ చేపట్టింది. మండలి చైర్మన్ శ్రీరంగారావు, సభ్యులు ఎండీ మనోహర్ రాజు, కృష్ణయ్యల ఐదేళ్ల పదవీకాలం ఈనెల 29తో ముగియనుంది. ఈలోపే ఈఆర్సీ కీలక నిర్ణయాలు తీసుకుంటుందనే టాక్ వినిపిస్తోంది. అయితే డిస్కంల ప్రతిపాదనలకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇస్తే.. నవంబర్ 1 నుంచి చార్జీల పెంపు అమల్లోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## తెలంగాణ పోలీసులకు రేవంత్ సర్కార్ శుభవార్త







నమస్తే హైదరాబాద్ : తెలంగాణ పోలీసులకు రేవంత్ రెడ్డి సర్కార్ గుడ్ న్యూస్ వినిపించింది. పోలీసుల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించేందుకు.. "యంగ్ ఇండియా పోలీస్ స్కూల్" ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట మేరకు.. యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ స్థాపనకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలోని పోలీసు అమరవీరులతో పాటు, ప్రస్తుతం విధుల్లో ఉన్న పోలీసులు, ఇతర యూనిఫాం సర్వీస్ డిపార్ట్‌మెంట్‌లకు చెందిన సిబ్బంది పిల్లలకు అంతర్జాతీయ ప్రమాణాలతో చదువును అందించేలా పాఠశాలను సిద్ధం చేసేందుకు.. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు.. రాష్ట్ర హోంశాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ రవి గుప్త సోమవారం(అక్టోబర్ 21న) రోజున జీవో జారీ చేశారు. అయితే.. ఈ యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ భవనాన్ని నిర్మించేందుకు రంగారెడ్డి జిల్లా మంచిరేవులలో స్థలాన్ని కూడా కేటాయించారు. అంతేకాకుండా.. మంచిరేవులలో నిర్మించబోయే యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌కు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన కూడా చేశారు. భవన నమూనా చిత్రాలను సీఎం రేవంత్ రెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీఎస్ శాంతి కుమారి, మంత్రి శ్రీధర్ బాబు తడితరులు పాల్గొన్నారు. పోలీస్ అమరుల పిల్లలతో పాటు సర్వీసులో ఉన్న పోలీసులు, ఫైర్, ఎక్సైజ్ లాంటి వివిధ రకాల సిబ్బంది పిల్లలకు ఈ యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌లో అడ్మిషన్లు కల్పించనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ పాఠశాల ఏర్పాటుకు అవసరమైన తదుపరి చర్యలను తీసుకోవాలని డీజీపీని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## ముత్యాలమ్మ గుడి ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి




నమస్తే హైదరాబాద్ : ప్రజల మధ్య వైషమ్యాలను రెచ్చగొట్టాలని చూస్తున్నారని.. కానీ, తెలంగాణ సమాజం అలాంటి వాటిని ప్రోత్సహించదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సికింద్రాబాద్ పరిధిలోని కుమ్మరిగూడలో ముత్యాలమ్మ ఆలయంలో జరిగిన ఘటనపై ముఖ్యమంత్రి సీరియస్‌గా స్పందించారు. ప్రజల్లో విభేదాలు సృష్టించాలనే సంఘ వ్యతిరేక శక్తుల చర్యలను నియంత్రించడంలో ప్రభుత్వం పోలీసులకు పూర్తి సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు. శాంతి భద్రతలకు విఘాతం కల్పించేవారిని ఉపేక్షించబోమని హెచ్చరించారు. ఇటీవల హైదరాబాద్‌లో విగ్రహాల ధ్వంసం ఘటనలలో నిందితుల మానసిక స్థితి ఆధారంగా వారిని కఠినంగా శిక్షించాలని పోలీసులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. తప్పు చేసిన వారి పట్ల కఠినంగా వ్యవహరించాలి. అదేవిధంగా ఎవరో తప్పు చేశారని, వాళ్లను తామే శిక్షిస్తామని కొందరు శాంతి భద్రతలను చేతుల్లోకి తీసుకుంటే.. అలాంటి సందర్భాల్లో తప్పు చేసిన వారికి, చట్టాలను చేతుల్లోకి తీసుకుంటున్న వారికి మధ్య తేడా లేకుండా పోతుంది. తప్పు చేసే వారెవరైనా పోలీసులు కఠినంగా వ్యవహరించాలి' అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సోమవారం (అక్టోబర్ 21) పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా గోషామహల్‌లో నిర్వహించిన ఫ్లాగ్ డే పరేడ్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. అమరవీరుల స్తూపం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులు అర్పించారు. అనంతరం అమరులైన పోలీసుల కుటుంబసభ్యులతో మాట్లాడారు. అనంతరం ప్రసంగిస్తూ.. ఏ రాష్ట్రమైనా ప్రగతి పథం వైపు నడవాలంటే శాంతి భద్రతల పరిరక్షణ అత్యంత కీలకమని చెప్పారు.

## అమిత్‌షా కోల్‌కతా పర్యటన వాయిదా..



నమస్తే హైదరాబాద్ : న్యూఢిల్లీ: కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఈనెల 24న కోల్‌కతాలో పర్యటించాల్సి ఉండగా తాజాగా ఆ పర్యటన వాయిదా పడింది. 'దానా' తుపాను హెచ్చరికల నేపథ్యంలో ఆయన పర్యటన రద్దయినట్టు అధికార వర్గాలు తెలిపాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం క్రమంగా బలపడుతోందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తాజాగా తెలిపింది. ఈ అల్పపీడనం క్రమంగా వాయవ్య దిశకు దూసుకొస్తోందని, అది బలపడి తుపానుగా మారనుందని పేర్కొంది. దీనికి "దానా తుఫాన్"గా నామకరణం చేశారు. ఈ తుఫాన్ పూరీ సమీపంలో తీరాన్ని తాకే అవకాశం ఉన్నట్టు అంచనా వేసింది. ఆ ప్రభావంతో ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల్లో భారీగా వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. దానా తుపాను ఉత్తర ఒడిసా, పశ్చిమబెంగాల్ తీరప్రాంతాలను తాకే అవకాశం ఉందని, పూరీ, సాగర్ ఐలాండ్ మధ్య 24-25వ తేదీ అర్ధరాత్రి తీరాన్ని తాకవచ్చని ఐఎండీ తెలిపింది. గంటకి 100 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో పెనుగాలు వీచవచ్చని తెలిపింది. దానా తుపాను హెచ్చరికల నేపథ్యంలో నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ టీమ్ (ఎన్డీఆర్ఎఫ్) అప్రమత్తమైంది. పశ్చిమబెంగాల్‌లో 14 టీమ్‌లు, ఒడిశాలో 11 టీమ్‌లను మోహరించింది. కాగా, అమిత్‌షా పర్యటన నేపథ్యంలో అక్టోబర్ 22 నుంచి నాలుగు రోజుల పాటు ఎగుమతి-దిగుమతుల కార్యక్రమాలను ఆపివేయాలంటూ ది ల్యాండ్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ఇంతకుముందే నోటీసులు జారీ చేసింది.

## ప్రశాంతంగా ప్రారంభమైన టీజీపీఎస్సీ గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షలు..




నమస్తే హైదరాబాద్ : హైదరాబాద్, అక్టోబర్ 21: తెలంగాణ రాష్ట్రంలో గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. వివాదాల నడుమ ఎట్టకేలకు గ్రూప్ 1 పరీక్షలు సోమవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి ప్రారంభమయ్యాయి. మధ్యాహ్నం 12.30 నుంచి అభ్యర్థుల్ని ఆయా పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తున్నారు. మధ్యాహ్నం 1.30 గంటల తర్వాత గేట్లు మూసేశారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మెయిన్స్ పరీక్షలు జరుగుతాయి. తొలి రోజు మొత్తం 46 పరీక్ష కేంద్రాల్లో 31,383 మంది అభ్యర్థులు ఈ పరీక్షలకు హాజరయ్యారు. అక్టోబరు 21 నుంచి 27 వరకు టీజీపీఎస్సీ గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షలు జరుగుతాయి. ఇప్పటికే పరీక్షల నిర్వహణకు హైదరాబాద్ నగర పోలీసులు పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు పూర్తి చేశారు. ఒక్కో పరీక్ష కేంద్రం వద్ద ఎస్సైల నేతృత్వంలో ప్రత్యేక బృందాలను ఉంచారు. అదనంగా పోలీస్ ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం కూడా పరీక్ష కేంద్రాలను సందర్శించేలా ఏర్పాట్లు చేశారు. పర్యవేక్షణకు 3 2లో

## ఏపీ డిప్యూటీ సీఎంకు సిటీ సివిల్ కోర్టు నోటీసులు



నమస్తే హైదరాబాద్ : హైదరాబాద్: తిరుమల శ్రీవారి లడ్డూలో ఉపయోగించే కల్తీ నెయ్యి అంశం ఇంకా కాకరేపుతూనే ఉంది. పంది కొవ్వు ఉపయోగించారని తెలిసి శ్రీవారి భక్తులు ఆందోళనకు గురయ్యారు. తిరుపతి లడ్డూపై రాజకీయ నేతలు, పలువురు ప్రముఖులు కామెంట్స్ చేశారు. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ 2లో

## త్వరలోనే కరీంనగర్‌లో ఈఎస్ఐ ఆస్పత్రి

నమస్తే హైదరాబాద్ : కరీంనగర్: జిల్లాలో ఈఎస్ఐ ఆస్పత్రిని ఏర్పాటు చేయాలని కోరుతూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఈరోజు (సోమవారం) కేంద్ర కార్మిక శాఖ మంత్రి డాక్టర్ మన్సూక్ మాండవీయను కోరారు. న్యూఢిల్లీలో మన్సూక్ మాండవీయను కలిసిన బండి సంజయ్ కరీంనగర్ జిల్లాలో ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని వివరించారు. కరీంనగర్ జిల్లా కేంద్రం మెడికల్ హబ్‌గా మారిందని 2లో

# త్వరలోనే కరీంనగర్‌లో ఈఎస్ఐ ఆస్పత్రి

బండి సంజయ్ తెలిపారు. ఉత్తర తెలంగాణ జిల్లాల నుంచి అత్యధిక మంది ప్రజలు వైద్యం కోసం కరీంనగర్‌కు విచ్చేస్తున్నారని తెలిపారు. ఉత్తర తెలంగాణలో బీడీ కార్మికులు, నేత కార్మికులు సహా వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల సంఖ్య అధికంగా ఉందని చెప్పారు. ఈ నేపథ్యంలో కరీంనగర్ జిల్లాలో ఈఎస్ఐ ఆస్పత్రిని ఏర్పాటు చేయడంతో తమ ప్రాంత ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతోందని అన్నారు. బండి సంజయ్ విజ్ఞప్తికి సానుకూలంగా మన్సూక్ మాండవీయ స్పందించారు. కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్సూక్ మాండవీయ అతి త్వరలో ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటుపై నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారని బండి సంజయ్ తెలిపారు.

# ప్రశాంతంగా ప్రారంభమైన టీజీపీఎస్సీ గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షలు..

కమిషనరేట్లలో ఒక్కో డీసీపీని నోడల్ అధికారిగా నియమించారు. హైదరాబాద్ నగర పరిధిలో ప్రశ్నపత్రాలు, జవాబుపత్రాలు తరలించే వాహనాలకు టీజీపీఎస్సీ తొలిసారిగా జీపీఎస్ ట్రాకింగ్ వ్యవస్థను ఉపయోగిస్తుంది. టీజీపీఎస్సీ ప్రధాన కార్యాలయం నుంచి పరీక్ష కేంద్రాలకు చేరుకునే వారకు వీటిని పర్యవేక్షిస్తారు. ఈ మేరకు పటిష్ట భద్రత నడుమ టీజీపీఎస్సీ ఛైర్మన్ మహేందర్‌రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఇలా తొలిరోజు ప్రశాంతంగా పరీక్షలను ప్రారంభించారు. గ్రూప్ 1 మెయిన్స్ మొత్తం 7 పేపర్లకు జరుగుతాయి. నేడు తొలి పరీక్ష జరుగుతుంది. ఇంకా మిగిలిన ఆరు పేపర్లకు రేపట్నుంచి ఆయా తేదీల్లో పరీక్షలు జరుగుతాయి. గత కొంత కాలంగా గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షలు వాయిదా వేయాలంటూ అభ్యర్థులు పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టిన సంగతి తెలిసిందే. ఇక గ్రూప్ 1 అభ్యర్థులకు సుప్రీంకోర్టులో కూడా నిరాశే ఎదురైంది. పరీక్షకు అంతా సిద్ధమైన సమయంలో తాము జోక్యం చేసుకోలేమని తేల్చి చెప్పింది. పరీక్ష వాయిదా వేయాలన్న మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు నిరాకరించింది. ప్రస్తుతం ఈ కేసు హైకోర్టులో ఉంది కాబట్టి.. తుది తీర్పునకు లోబడే నియామకాలు ఉంటాయని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసిందన్న సుప్రీంకోర్టు.. తెలంగాణ హైకోర్టులోనే విచారణ జరపాలని ఆదేశించింది. ఫలితాల వెల్లడికి ముందే తుది తీర్పు ఇవ్వాలని సూచించింది.

# ఏపీ డిప్యూటీ సీఎంకు సిటీ సివిల్ కోర్టు నోటీసులు

కూడా స్పందించారు. గత పాలక మండలి కల్తీ నెయ్యి ఉపయోగించిందని ఆరోపించారు. పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలతో చాలా మంది భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయి. ఇదే అంశంపై హైదరాబాద్‌కు చెందిన అడ్వకేట్ ఇమ్మనేని రామారావు సిటీ సివిల్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. భక్తులకే కాదు.. అయోధ్యలో రామ్ లల్లా ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి కూడా తిరుపతి లడ్డూ పంపించారని పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. పవన్ చేసిన కామెంట్లతో హిందువుల మనోభావాలు దెబ్బతిన్నాయి. తిరుమల లడ్డూ తయారీ కోసం జంతువులు కొవ్వు కలిపారని అనడం దారుణం. ఆ ఆరోపణలకు సంబంధించి ఫొటోలు, వీడియోలను కోర్టు ముందు ఉంచాం. లడ్డూ గురించి పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను ప్రసారం చేసిన యూట్యూబ్ చానెళ్ల నుంచి ఆ కామెంట్లను తొలగించాలి అని' పిటిషనర్ సిటీ సివిల్ కోర్టులో వేసిన పిటిషన్‌లో పేర్కొన్నారు. తిరుమల లడ్డూకు సంబంధించి ఇమ్మనేని రామారావు వేసిన పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి వై రేణుకతో కూడిన ధర్మాసనం విచారణకు స్వీకరించింది. వచ్చే నెల 22వ తేదీన కోర్టుకు వ్యక్తిగతంగా హాజరు కావాలని సమన్లు జారీచేసింది. ఈ అంశంపై పవన్ కల్యాణ్ స్పందించాల్సి ఉంది. తిరుపతి లడ్డూలో కల్తీ నెయ్యి ఉపయోగించారని సీఎం చంద్రబాబు చేసిన వ్యాఖ్యలతో తెలుగు రాష్ట్రాలతో రాజకీయ దుమారం నెలకొంది. ఆ అంశంపై సిటీ సివిల్ కోర్టులో పిటిషన్ వేయడంతో.. న్యాయస్థానం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు సమన్లు జారీ చేసింది.

# వైద్య సేవలు వెలకట్టలేనివి



కాజీపేట్ అక్టోబర్ 21 నమస్తే హైదరాబాద్ సమాజంలో వైద్య సేవలు వెలకట్టలేనివని, వారిని కని పించే దైవంలా ప్రజలు గౌరవిస్తారని విద్యా వేత్త, కాళోజీ మిత్రుడు నల్ల ప్రభాకర్ అన్నారు. కాజీపేట మండలం మడికొండ ప్రజలకు 50 ఏళ్ల పాటు వైద్య సేవలందిం చిన ఆర్ఎంపీ డాక్టర్ యాదగిరిని మెట్టురా మలింగేశ్వరస్వామి వెల్ఫేర్ సొసైటీ ఆది వారం కొండపై ఘనంగా సత్కరించింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రభాకర్ మాట్లాడారు. అనంతరం సొసైటీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్య క్షుడిగా డాక్టర్ యాదగిరి, కార్యదర్శిగా బుర్ర వెంకటస్వామి, కోశాధికారిగా గురుపతి, తది తర కార్యవర్గాన్ని నియమించారు.

# మురుగునీటి సమస్యను పరిష్కరించండి మహాప్రభో..!

మేడిపల్లి (నమస్తే హైదరాబాద్): పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఒకటవ డివిజన్ అయోధ్య నగర్,సుమా రెసిడెన్సి కాలనీ వాసులు సోమవారం ప్రజావాణిలో మేయర్ అమర్ సింగ్ కు వినతి పత్రం అందించారు. వారం రోజుల్లో కాలనీలో పర్యటించి సమస్య పరిష్కరిస్తానని మేయర్ హామీ ఇచ్చారు. డివిజన్ పరిధిలోని అయోధ్య మరియు సుమ రెసిడెన్సీ కాలనీలలో మురుగునీరు ఏరులై పారడంతో కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమములో మేయర్ అమర్ సింగ్,కమిషనర్,ఇతర అధికారులకు విన్నవించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ గత మూడు సంవత్సరాల నుండి అనుభవిస్తున్న మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలని పలుమార్లు మున్సిపల్ కమిషనర్ కు ప్రజా ప్రతినిధులకు విన్నవించిన ఫలితం మాత్రం శూన్యంగా ఉందని బోడుప్పల్ కార్పొరేషన్ నుండి వచ్చే మురుగునీరు, వరద నీరు నిత్యం కాలనీలలో



ఏరులై పారడంతో దుర్గంధం,దోమల బెడద తో మహిళలు వృద్ధులు పిల్లలు తీవ్ర అనారోగ్యాల బారిన పడుతున్నారని, ఎస్ ఎన్ డి పి పనులు పూర్తయ్యే వరకు మురుగునీరు వెళ్లేందుకు తాత్కాలిక ఏర్పాట్లయినా చేయాలని మేయర్ దృష్టికి తీసుకెళ్లామని, సానుకూలంగా స్పందించిన మేయర్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ సభ్యులు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# వర్గీకరణ తరువాతనే ఉద్యోగ నియామకాలు చేపట్టాలి

### ఎంహెచ్ పి ఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మైస ఉపేందర్ మాదిగ



కాజీపేట అక్టోబర్ 21( నమస్తే హైదరాబాద్) ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన వెంటనే అన్ని రాష్ట్రాల కంటే ముందే అమలు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ప్రకటించారని మాదిగ హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మైస. ఉపేందర్ మాదిగ తెలిపారు. ఎస్సీ వర్గీకరణను పక్కనపెట్టి ఉద్యోగ నియామకాలు చేస్తున్నారని మరోసారి తెలంగాణలో మాదిగ లను ఈ ప్రభుత్వం మోసం చేస్తుందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరాలోచించాలని ఉపసంఘం పేరుతో కాలయాపన చేయొద్దని కోరారు. వర్గీకరణ చేసేదాకా ఉద్యోగ ఖాళీలు చేయొద్దని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాదిగ లకు తీరని అన్యాయం చేస్తుందని మరోసారి తెలంగాణలో మాదిగ మలిదశ ఉద్యమానికి ఈ ప్రభుత్వం ఉసిగోల్పుతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో మాదిగల పోరాటం ఎంతో ఉందని మాదిగల కృషి తోనే రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాడని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఎస్సీ వర్గీకరణ కోసం మాదిగలు జాతీయ స్థాయి ఉద్యమానికి సైతం సిద్దమేనని హెచ్చరించారు.

# వడ్ల కొనుగోలు సెంటర్లలో రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలి

### రైతు సేవ సహకార సంఘం ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన సింగిల్ విండో చైర్మన్ గుడిపాటి సైదులు

నమస్తే హైదరాబాద్ తుంగతుర్తి ప్రతినిధి అక్టోబర్ 21: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఉమ్మడి నల్లగొండ జిల్లా డిసిసిబి డిసిఎంఎస్ డైరెక్టర్, తుంగతుర్తి సింగిల్ విండో చైర్మన్ గుడిపాటి సైదులు అన్నారు. మండల పరిధిలోని వెలుగుపల్లి, అన్నారం గ్రామాలలో ది రైతు సేవ సహకార సంఘం(ఎఫ్ ఎస్ సి ఎస్)ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సొసైటీ డైరెక్టర్ల తో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గుడిపాటి సైదులు మాట్లాడుతూ...కొనుగోలు సెంటర్లకు ధాన్యాన్ని తీసుకువచ్చే రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. రైతుల సౌకర్యార్థం కాంగ్రెస్ ప్రభుత్వం వరి కోతలకు ముందుగానే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని తెలిపారు. మద్దతు ధరతో పాటు ప్రభుత్వం రూ.500 బోనస్ కూడా చెల్లిస్తుందని చెప్పారు. ప్రస్తుతం నెలకొన్న వాతావరణ



పరిస్థితుల నేపథ్యంలో రైతులు ఆందోళన ఉన్నమాట వాస్తవమే కానీ ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యం నాణ్యత వచ్చాకే మిల్లులకు తరలించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఈవో వెంకటేశ్వర్లు, రెవిన్యూ ఇన్స్పెక్టర్ రవీందర్ రెడ్డి, ఇరిగేషన్ ఏఈ కళ్యాణ్, సొసైటీ డైరెక్టర్లు కేతిరెడ్డి రవీందర్ రెడ్డి, పులుగుజ్జ యాకయ్య, బిక్షం రెడ్డి, మజీద్, రామ నర్సమ్మ, సొసైటీ సిబ్బంది యాదగిరి, ఉమేష్, మహేశ్,రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఫణిగిరిలో నూతన మాల మహానాడు గ్రామ కమిటీ ఎన్నిక



నాగారం, నమస్తే హైదరాబాద్ :(అక్టోబర్ 21)తెలంగాణ రాష్ట్ర మాల మహానాడు అధ్యక్షులు పిల్లి సుధాకర్ ఆదేశానుసారం తిరుమలగిరి మున్సిపాలిటీ అధ్యక్షులు గంట లక్ష్మణ్ ఉపాధ్యక్షులు గంట సందీప్ తిరుమలగిరి మాల మహానాడు నాయకులు మద్దెల ప్రభుదాస్ ,గంట యాకూబ్ ల ఆధ్వర్యంలో నాగారం మండలం పనిగిరి గ్రామంలో సోమవారం నూతనంగా మాల మహానాడు గ్రామ కమిటీ ఎన్నుకోవడం జరిగింది . మాల మహానాడు గ్రామ శాఖ అధ్యక్షులుగా గోరె%శీ%ట్ల సామేల్,ఉపాధ్యక్షులుగా యాట ప్రకాష్,ప్రధాన కార్యదర్శి గా ఇటుక ప్రసాద్,కార్యదర్శిగా కర్నే అఖిల్, కోశాధికారిగా కడారి మల్లయ్య లను ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు మరియు మాల మహానాడు నాయకులు చిలుకూరి జయరాజు, సామెల్, పెరుమళ్ళ జాన్ వెస్లీ, సిహెచ్ సామెల్, చిరంజీవి, వెంకన్న, ముదిగొండ జయరాజు, గొడిశాల అనిల్, కడారి అబ్రహం, పెరుమల్ల సురేష్, నీరుడు స్వామి దాస్, భాష మల్లె యాకోబ్, యాట భాస్కర్, దిలీప్,వేరుపుల వెంకన్న, బందెల శేఖర్, ముల్క చరణ్, రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.

# బనుక శివ రాజ్ ని ఘనంగా సన్మానించిన నల్ల శ్రీరాములు

జనగాం ప్రతినిధి ( నమస్తే హైదరాబాద్ )

జనగాం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గా బనుక శివరాజ్ , వైస్ చైర్మన్ గా కొల్లూరు నరసింహులు నియమితులయ్యారు సోమవారం ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా దేవరుప్పుల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నల్ల శ్రీరాములు వారిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో, మండల కాంగ్రెస్ పార్టీనాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



# నాగారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కోటాచలం



నాగారం, నమస్తే హైదరాబాద్ :(అక్టోబర్ 21) నాగారం మండలం కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కోటాచలం సోమవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాధారణ కాన్పులు జరిగేలా ప్రోత్సహించాలని,అవసరమైన మందుల జాబితాను తయారు చేసి రిజిస్ట్రేషన్ నందు పొందుపరచాలని అన్నారు.పి హెచ్ సి లో నిర్వహించు వివిధ రకాల రికార్డులను, రిజిస్టర్లను తనిఖీ చేసి హెచ్చరించారు. ఆరోగ్య సిబ్బంది సమయపాలన క్రమం తప్పకుండా పాటించాలని లేనిచో శాఖ పరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బిపి, షుగర్ ఇతర అసంక్రామిక వ్యాధులకు చికిత్సలు ఆరోగ్య కేంద్రాలలో ప్రజలకు అందుబాటులో ఉండేల చూసుకోవాలని,ఆరోగ్య సిబ్బంది ఎప్పుడు ప్రజలతో మమేకమై ఉండాలని సూచించారు. ఓపి రూమ్, ఔషధాల శాల తనిఖీ చేసి అవసరమైన మందులను అందుబాటులో ఉండేలా చూసుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

# ఈతకు వెళ్లి బాలుడు మృతి



నాగారం, నమస్తే హైదరాబాద్ :(అక్టోబర్ 21) ఈత కోసమని వాగులోకి వెళ్లి కమ్మంపాటి మణికుమార్ (11)అనే బాలుడు మృతి చెందిన సంఘటన ఆదివారం మండల పరిధిలోని వర్ధమానుకోట గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే ఆదివారం సెలవు కావడంతో నలుగురైదురు బాలురు కలిసి వాగును చూడడానికి బిక్కేర్ వాగు దగ్గరికి వెళ్లారు. నీటిలోకి దిగి ఆడుకుంటుండగా వరద ఉధృతి ఎక్కువగా కావడంతో ఒక బాలుడు వాళ్ల ముందే నీటిలో కొట్టుకొని పోవడంతో మిగతావారు భయపడి ఎవరికి చెప్పకుండా తమ ఇండ్లకు వెళ్లారు. మణికుమార్ తల్లిదండ్రులు కమ్మంపాటి నాగరాజు ఉపేంద్ర లు పొలం పనికి పోయి సాయంత్రం ఇంటికి వచ్చేసరికి మణికుమార్ కనిపించకపోవడంతో అతనితో వెళ్ళిన వారిని మందలించగా పొంతన లేని సమాధానం చెప్పడంతో వారిని పోలీసులు గట్టిగా అడగడంతో నీటిలో గల్లంతయిన విషయాన్ని చెప్పారు. వలలతో గాలింపు చేపట్టగా చెక్ డాం ముందు మృతదేహం లభించడంతో కుటుంబ సభ్యులు గుండెలు బాదుకొని రోధిస్తున్నారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# మంద స్వామి దాస్ కి టీచర్స్ ఎక్సెలెంట్ అవార్డు ప్రధానం

ఘట్కేసర్ ( నమస్తే హైదరాబాద్) : ఘట్కేసర్ మండల్ చౌదరిగూడ గ్రామం వ్యాయామ ఉపాధ్యాయుడు మంద స్వామి దాస్ కి అంతర్జాతీయ టీచర్స్ డే సందర్భంగా టీచర్స్ ఎక్సెలెంట్ అవార్డును అందజేశారు. ఈ మేరకు నగరంలోని బీర్ల ప్లానిటోరియం ఆడిటోరియంలో ఆదివారం జరిగిన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో స్వామి దాస్ కి టీచర్స్ ఎక్సెలెంట్ అవార్డును పద్మశ్రీ అవార్డు గ్రహీత సోమలాల్ నాయక్ చేతుల మీదుగా అందజేశారు. స్కై లైన్ ఫౌండేషన్, శారద ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అవార్డుల ప్రధాన కార్యక్రమేనికి ముఖ్య అతిథులుగా హాజరై న పద్మశ్రీ అవార్డు గ్రహీత సోమలాల్ నాయక్ మంద స్వామి దాస్ కు టీచర్స్ ఎక్సెలెంట్ అవార్డును అందజేశారు. గత 28 సంవత్సరాలుగా విద్యార్థుల అభ్యున్నతికి , విద్యార్థుల, నిరుద్యోగులకు ఆయా శాఖలలో ఉద్యోగాలు వచ్చేందుకు కృషి చేసినందుకు మరియు వ్యాయామ ఉపాధ్యాయుడిగా రామంతపూర్ లోని బాలభారతి ఉన్నత పాఠశాలలో చేసిన సేవలను గుర్తించి ఆయా సంస్థల వారు స్వామి దాస్ కి ఈ అవార్డును బహుకరించడం జరిగింది. ఈ సందర్భంగా స్వామి దాస్ మాట్లాడుతూ అవార్డు తమకు రావడం చాలా సంతోషంగా ఉందని ఇలాంటి అవార్డుల ద్వారా బాధ్యత పెరుగుతుందని



అన్నాడు. అవార్డు ఇచ్చినందుకు గాను శారద ఎడ్యుకేషనల్ సొసైటీ నిర్వాహకులు చైర్మన్ పట్నం కమలాకర్ (కమల మనోహర్) స్కై లైఫ్ ఫౌండేషన్ నిర్వాహకులు పసుపులేటి నరేందర్ కు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఏపీజే అబ్దుల్ కలాం 20 24 లైఫ్ టైం అచీవ్మెంట్ అవార్డు పొందిన నవీన్ కుమార్



ఘట్కేసర్ అక్టోబర్ 21 నమస్తే హైదరాబాద్ మేడ్చల్ జిల్లా, ఘట్కేసర్, శ్రీ ప్రగతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏపీజే అబ్దుల్ కలాం 20 24 లైఫ్ టైం అచీవ్మెంట్ అవార్డుని కొలకలూరి నవీన్ కుమార్ కి శ్రీ ప్రగతి ఫౌండేషన్ అధినేత వి ఆర్ శ్రీనివాస్ రాజు ఇవ్వడం జరిగింది. నవీన్ కుమార్ మాట్లాడుతూ లైఫ్ టైం అచీవ్మెంట్ అవార్డుని శ్రీ ప్రగతి ఫౌండేషన్ అధినేత వి ఆర్ శ్రీనివాస్ రాజు చేతుల మీదుగా తీసుకోవడం ఎంతో ఆనందంగా ఉందని అలాగే తనకు ప్రత్యేకత ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రివర్యులు శ్రీ ఎర్రబెల్లి దయాకర్ రావు, సుధాకర్ సినీ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

# ఎంబీబీఎస్ విద్యార్థి చదువుకి బాసటగా ఉప్పల్ ఎమ్మెల్యే

## స్వయంగా ఎంబీబీఎస్ విద్యార్థి ఇంటికి వెళ్లి చెక్కును అందజేసిన ఉప్పల్ ఎమ్మెల్యే




ఉప్పల్ ( నమస్తే హైదరాబాద్): కాప్రా డివిజన్ సాయి బాబా నగర్ కి చెందిన కుంచం నర్సయ్య కుమారుడు కుంచం గీత కృష్ణ ప్రభుత్వ మెడికల్ కాలేజీ నిర్మల్ లో ఎంబీబీఎస్ సీటు సాధించాడు.ఫీజు కట్టలేక ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న ఉప్పల్ శాసనసభ్యుడు బండారు లక్ష్మారెడ్డి తన స్వంత నిధులతో బి ఎల్ ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎంబీబీఎస్ కి అయ్యే ఫీజు 29,000/- రూపాయల చెక్కు వారి ఇంటికి వెళ్లి అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని ఎవరైనా ఎంబీబీఎస్ సీటు సాధిస్తే ఫీజు మొత్తం తానే చెల్లిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం లో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు బైరీ నవీన్ గౌడ్, మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకులుబద్రిద్దిన్ ,ఇంద్రయ్య , బంక వెంకటేష్ , శ్రీకాంత్ గౌడ్ , ప్రసాద్ ,మధు , గౌస్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ ప్రతిష్టను కాపాడండి - తరుణ్ గౌడ్



బోడుప్పల్ అక్టోబర్ 21 (నమస్తే హైదరాబాద్) మేడ్చల్ జిల్లా, బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ లోని మారుతి నగర్ కాలనీలో శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో నిత్య పూజలు జరగనీయకుండా చేస్తున్నారని ఆలయ భూమి దాత తరుణ్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు, ఆలయ అధ్యక్షులుగా వ్యవహరిస్తున్న రాపోలు సత్యనారాయణ ఒంటెద్దు పోకడ వల్ల దేవాలయంలో పూజలు జరగడం లేదనీ దేవాలయానికి వచ్చే ఆదాయాన్ని గుడి అవసరాలకు వాడకపోవడం వలన, గుడి లో గత రెండు రోజులుగా ఏ పూజలు లేకుండా తాళాలు వేసి ఉండడాన్ని ఖండిస్తూ ఇకనైనా గుడిని తెరిచి నిత్య పూజలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మారుతి నగర్ కాలనీ అధ్యక్షులు రాంబాబు గౌడ్, జనరల్ సెక్రటరీ చంద్రశేఖర్ శ్రీనివాస్ గౌడ్, సంతోష్ రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు

# రైతులు మధ్య దళారీలను ఆశ్రయించి నష్టపోవద్దు

నమస్తే హైదరాబాద్ : రైతులు ఆరుకాలం కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని అమ్మడానికి మధ్య దళారీలను ఆశ్రయించి నష్టపోవద్దని స్థానిక శాసన సభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం వలిగొండ, ఆరూర్ గ్రామాలలో పిఎసిఎస్ ఆధ్వర్యంలో, మండలకేంద్రం లోని వ్యవసాయ మార్కెట్ లో, సుంకిశాల, పులిగిల్ల, కెర్చుపల్లి, మొగిలిపాక, వెల్వర్తి గ్రామాలలో ఐకెపి ఆధ్వర్యంలో, రెడ్లరేపాక, పహిల్వాన్ పురం గ్రామాలలో ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన వరి ధాన్యాన్ని అమ్మడానికి మధ్యదళారీలను ఆశ్రయించి నష్టపోవద్దని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు నాణ్యతతో కూడిన ధాన్యాన్ని తరలించి ప్రభుత్వ మద్దతు దర క్వింటాలుకు 2320 రూపాయల చొప్పున పొందాలని అన్నారు.ఈ కార్యక్రమంలో వాకిటి అనంత రెడ్డి, భూక్య భీమా నాయక్, బడుగు సత్యనారాయణ,



సురకంటి వెంకట్ రెడ్డి,పాశం సత్తిరెడ్డి, గరిసె రవి, బద్దం సంజీవ రెడ్డి, పలుసం సతీష్, చిలుగురి సత్తి రెడ్డి, కంకల కిష్టయ్య, కొమురెల్లి సంజీవ రెడ్డి, ఎడవెల్లి యాదగిరి, కల్యూరి చంద్రయ్య, ఉక్కుర్తి స్వామి, బైరు సైదులు గౌడ్, పిట్టల గణేష్, చెవ్వ మధు, ఏపిఎం ఝూనీ తదితరులు పాల్గొన్నారు.

# సినిమా



## రియా దొరికేసిందిరోయ్..!



రీసెంట్ డేస్ లో వచ్చిన సినిమాల్లో ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుడుకున్న సినిమా మత్తువదలరా 2. రితేష్ రానా దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. గతంలో వచ్చిన మత్తువదలరా సినిమాకు సీక్వెల్ గా వచ్చింది ఈ సినిమా.. మత్తువదలరా సినిమా మంచి విజయాన్ని అందుకుంది. కామెడీ ఎంటర్టైనర్ గా తెరకెక్కిన ఈ సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. టీజర్స్, ట్రైలర్ తోనే ఆసక్తిరేకెత్తించిన మత్తు వదలరా 2 సెప్టెంబర్ 13న థియేటర్లలో విడుదలైంది. మొదటి షో నుంచే సూపర్ హిట్ టాక్ సొంతం చేసుకుంది ఈ సినిమా. సినిమా చూసిన వారందరూ కడుపుబ్బా నవ్వుకున్నామంటున్నారు. ముఖ్యంగా సత్య కామెడీ నెక్స్ట్ లెవల్ అంటున్నారు. సత్య సింగిల్ హ్యాండ్ తో సినిమా నడిపించాడని అంటున్నారు ప్రేక్షకులు.అలాగే ఈ సినిమా ఇప్పుడు ఓటీటీలో అదరగొడుతోంది. ఓటీటీలో ఈ సినిమా దూసుకుపోతోంది. ఈ సినిమాలో చాలా మీమ్స్ ను వాడుకున్నారు, రెగ్యులర్ గా సోషల్ మీడియాలో దర్శనమిచ్చే మీమ్స్ ను మత్తువదలరా 2లో చాలానే వాడారు. అలాగే ఈ సినిమాలో ఓ డైలాగ్ చాలా పాపులర్ అయ్యింది. అదే రియా ఎక్కడ.?సత్య అజయ్ మధ్య జరిగే డిస్కషన్ లో ఈ డైలాగ్ వినిపిస్తుంది.. కాగా సత్య అజయ్ ను రియా ఎక్కడ.? అని అడగ్గా అజయ్ రియా ఎవరు అని అడుగుతాడు. దానికి దామిని డాటర్ అని సత్య అనగానే.. దామిని ఎవరు.? అని తిరిగి ప్రశ్నిస్తాడు అజయ్. దానికి సత్య రియా మదర్ అని చెప్తాడు.. అసలు వాళ్లిద్దరూ ఎవరు అని అజయ్ అడగ్గా.. మదర్ అండ్ డాటర్ అని సమాధానం చెప్తాడు సత్య. ఈ ఫన్నీ డిస్కషన్ బాగా పాపులర్ అయ్యింది. దాంతో సోషల్ మీడియాలోనూ రియా ఎక్కడ.? అంటూ నెటిజన్స్ క్రేజీగా కామెంట్స్ చేస్తున్నారు. అలాగే అసలు ఈ రియా ఎవరు అని కూడా నెటిజన్స్ గూగుల్ లో గాలిస్తున్నారు. ఈ క్రమంలోనే ఆమె ఫొటోలు సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తున్నాయి. ఆమె పేరు ఇషా యాదవ్. ఈ అమ్మడు సోషల్ మీడియాలో మంచి క్రేజ్ తెచ్చుకుంది. ఈ చిన్నదాని ఫోటోలు, వీడియోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి.



## వారికి మద్యం విషం లాంటిదంట..



కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్న వ్యక్తులకు మద్యం తాగడం ప్రమాదకరమని.. ఇది చాలా తీవ్రమైన పరిణామాలను కలిగిస్తుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. కిడ్నీలు మన శరీరంలోని మురికిని ఫిల్టర్ చేసే ఫిల్టర్‌లా పనిచేస్తాయి. కిడ్నీ ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి, మనం ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవాలి.. కానీ కొందరు వ్యక్తులు అధిక ఆల్కహాల్ వ్యసనానికి గురవుతారు. ఇది మూత్రపిండాలను దెబ్బతీస్తుంది. మద్యపానం మన కిడ్నీలను ఎలా దెబ్బతీస్తుంది.. నిపుణులు చెబుతున్న సూచనలు ఏంటో తెలుసుకోండి..

కిడ్నీలకు ఆల్కహాల్ ఎలా హాని కలిగిస్తుంది..

వాస్తవానికి రక్తంలో చేరుతున్న వ్యర్థాలను గాలించి, వడపోసి, శుభ్రం చేసే పని మూత్రపిండాలది. ఈ మూత్రపిండాలు విరామం లేకుండా పనిచేసి రక్తాన్ని శుభ్రంగా ఉంచుతాయి. అయితే.. కిడ్నీ రోగులకు ఆల్కహాల్ తీసుకోవడం చాలా ప్రమాదకరం.. ఎందుకంటే ఆల్కహాల్ మూత్రపిండాలు దెబ్బతినే ప్రమాదాన్ని పెంచుతుంది, మూత్రపిండాల పనితీరును కష్టతరం చేస్తుంది. ఆల్కహాల్ మూత్రపిండాలను తీవ్రంగా ప్రభావితం చేస్తుంది.. వాటి ప్రభావాన్ని తగ్గిస్తుంది. కిడ్నీ రోగులు అధికంగా ఆల్కహాల్ తీసుకుంటే, అది వారి కిడ్నీలను పూర్తిగా దెబ్బతీస్తుంది.. వ్యాధి నయం అవుతుందనే పరిస్థితే ఉండదు.. ఒక్కోసారి వైద్య అత్యవసర పరిస్థితి ఏర్పడవచ్చు.. ప్రాణాంతకంగా కూడా మారవచ్చు..

మూత్రపిండాల పనితీరుపై ప్రభావం..

కిడ్నీ రోగులకు, మద్యపానం మూత్రపిండాల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. ప్రత్యేకించి వారు ఇప్పటికే మూత్రపిండాల వ్యాధిని ఎదుర్కొంటుంటే.. వాటి పరిస్థితి మరింత దిగజారవచ్చు.. అదనంగా, మద్యపానం మానసిక ఆరోగ్యంపై కూడా ప్రతికూల ప్రభావాలను కలిగిస్తుంది.. కిడ్నీ సమస్యలు, మానసిక ఆరోగ్యం.. ఇలా రోగుల పరిస్థితి మరింత అధ్వాన్నంగా మారుతుందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు.

కిడ్నీ పేషెంట్లు వీలైనంత త్వరగా మద్యపానాన్ని వదులుకోవడానికి ప్రయత్నించాలి.. ఈ పని ఎంత కష్టంగా అనిపించినా, మీరు దీన్ని నియంత్రించినట్లయితే దీర్ఘకాలికంగా మీ కిడ్నీలు పాడైపోకుండా కాపాడుకోవచ్చు.. ఇంకా అత్యవసర పరిస్థితిని నివారించవచ్చు. ఆల్కహాల్ వల్ల కలిగే అన్ని ఇతర దుష్ప్రభావాలు, వ్యాధులను నివారించే అవకాశాన్ని కూడా పొందవచ్చు..

మూత్రపిండాల ఆరోగ్యాన్ని మెరుగుపరిచే పానీయాలు

మీరు ఆల్కహాల్‌ను మానుకున్న తర్వాత.. మూత్రపిండాల ఆరోగ్యాన్ని మెరుగుపరిచే కొన్ని ఆరోగ్యకరమైన పానీయాలను త్రాగాలని ఆయుర్వేద నిపుణులు సూచిస్తున్నారు. బీట్‌రూట్ రసం, నిమ్మరసం, అల్లం రసం, కొబ్బరి నీరు, పుదీనా నీరు లాంటివి కిడ్నీల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి.

## దీపావళి గిఫ్ట్, బోనస్‌లపై ట్యాక్స్ చెల్లించాలా?



దీపావళికి కొన్ని రోజులు మాత్రమే మిగిలి ఉన్నాయి. ఈ పండుగ సందర్భంగా ప్రజలు ఒకరికొకరు బహుమతులు అందజేసుకుంటారు. ఈ పండుగ సందర్భంగా ఉద్యోగులు తమ కంపెనీ నుండి బహుమతులు (దీపావళి బహుమతి), బోనస్ (దీపావళి బోనస్) పొందుతుంటారు. అయితే ఈ గిఫ్ట్‌లు, బోనస్‌లపై ట్యాక్స్ ఉంటుందని మీకు తెలుసా? అంటే, ఆదాయపు పన్ను నిబంధనల ప్రకారం, మీరు వాటిపై పన్ను చెల్లించాల్సి ఉంటుంది.దీపావళి గిఫ్ట్, బోనస్‌పై పన్ను:

ఆదాయపు పన్ను చట్టం ప్రకారం, కంపెనీ నుండి స్వీకరించిన ఏదైనా గిఫ్ట్ లేదా బోనస్‌పై పన్ను ఉంటుంది. మీ జీతంలో భాగమైనందున అది పన్ను పరిధిలోకి వస్తుంది. బోనస్ ద్వారా వచ్చే ఆదాయంపై విధించే పన్ను మీ మొత్తం పన్ను స్లాబ్ ప్రకారం నిర్ణయిస్తారు. అయితే, కొన్ని దీపావళి గిఫ్ట్‌లు, బోనస్‌లకు పన్ను విధించరు.రూ.5,000 వరకు గిఫ్ట్‌లు: కంపెనీ నుంచి రూ.5,000 వరకు పొందే పండగ గిఫ్ట్‌లపై ఎలాంటి పన్ను ఉండదు.

దీపావళి బహుమతులు, బోనస్‌లపై పన్ను ఆదా చేయడానికి చిట్కాలు:

క్లెయిమ్ మినహాయింపు: మీ దీపావళి బహుమతి విలువ రూ. 5,000 వరకు ఉంటే, మీరు బహుమతికి సంబంధించిన పత్రాలను చూపడం ద్వారా మినహాయింపును క్లెయిమ్ చేయవచ్చు.

ఖరీదైన బహుమతులపై ఈ విధంగా పన్ను ఆదా చేయండి: మీ కంపెనీ మీకు రూ. 5,000 కంటే ఎక్కువ విలువైన బహుమతిని ఇవ్వబోతున్నట్లయితే, మీరు దానిపై పన్ను చెల్లించాల్సిన అవసరం లేని విధంగా బహుమతిని రూపొందించమని మీరు వారిని అభ్యర్థించవచ్చు. ఉదాహరణకు వారు మీకు రూ.5,000 వరకు గిఫ్ట్ వోచర్‌ను అందించి, మిగిలిన మొత్తాన్ని బోనస్‌గా ఇవ్వవచ్చు.

నగదుకు బదులుగా ఈ ఆప్షన్ ఎంచుకోండి: నగదుకు బదులుగా బహుమతి వోచర్‌లు, బంగారు నాణేలు లేదా ఏదైనా ఉపకరణాన్ని ఇచ్చే ఎంపిక మంచిది. ఎందుకంటే క్యాష్ బోనస్‌తో పోలిస్తే సాధారణంగా వీటిపై పన్ను విధించే అవకాశం తక్కువ.

విరాళం: మీ దీపావళి బోనస్‌లో కొంత భాగాన్ని గుర్తింపు పొందిన స్వచ్ఛంద సంస్థకు విరాళంగా ఇవ్వడానికి మీ కంపెనీ మిమ్మల్ని అనుమతిస్తే, మీరు విరాళంగా ఇచ్చిన మొత్తానికి పన్ను మినహాయింపును క్లెయిమ్ చేయవచ్చు.

బహుమతి మూలం: విలువతో సంబంధం లేకుండా స్నేహితుడు లేదా బంధువు నుండి పొందిన బహుమతులకు సాధారణంగా పన్ను ఉండదు. బంధువు మీకు బహుమతిని పంపితే, విలువ నిర్దిష్ట పరిమితిని మించి ఉంటే అది పన్ను విధించవచ్చు. ఇతర బహుమతుల కంటే నగదు లేదా నగలు వంటి కొన్ని రకాల బహుమతులపై పన్ను విధించే అవకాశం ఉంటుంది.

## టెస్ట్ క్రికెట్‌లో రబడా వరల్డ్ రికార్డు.




దక్షిణాఫ్రికా స్టార్ ఫేసర్ కగిసో రబడా టెస్ట్ క్రికెట్ చిత్రలో అరుదైన ఘనత సాధించాడు. టెస్టుల్లో 300 వికెట్ల మైలురాయిని చేరిన ఈ సఫారీ ఫాస్ట్ బౌలర్.. బంతుల పరంగా అతి వేగంగా ఈ ఘనతను సాధించిన బౌలర్‌గా ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. టెస్ట్ క్రికెట్‌లో 11,817 బంతుల్లో రబడా 300 వికెట్లు సాధించాడు. ఇప్పటి వరకు పాకిస్థాన్ మాజీ ఫేసర్ వకార్ యూనిస్ పేరిట ఈ ప్రపంచ రికార్డ్ ఉంది. పాక్ దిగ్గజ ఫేసర్ వకార్ యూనిస్ 12,602 బంతుల్లో 300 టెస్ట్ వికెట్లు సాధించాడు. దక్షిణాఫ్రికా, బంగ్లాదేశ్ జట్ల మధ్య ఢాకా స్టేడియంలో జరిగిన జరుగుతున్న తొలి టెస్ట్ మ్యాచ్‌లో రబడా సోమవారంనాడు (అక్టోబర్ 21) ఈ రికార్డును తన పేరిట తిరగరాశాడు.దక్షిణాఫ్రికాకు చెందిన డేల్ స్టెయిన్ 12,605 బంతుల్లో 300 టెస్ట్ వికెట్లు సాధించగా.. ఆ దేశానికి చెందిన మరో దిగ్గజ ఫేసర్ అలన్ డొనాల్డ్ 13,672 బంతుల్లో ఈ ఘనత సాధించాడు. వెస్టిండీస్‌కు చెందిన మార్షల్ 13,728 బంతుల్లో 300 టెస్ట్ వికెట్ల క్లబ్‌లో చేరాడు.

**Printed published and owned by Godishala Somaiah published from # 15-76,Medipally, Ghatkesar,Ranga reddy,Dist,Printed at Sri SehaSai Printers,IDA BalaNagar, Hyderabad,Editor : Godishala Somaiah,email:nhnews24@gmail.com,ph 9912580066,RNI APTEL/2012/45237..**